విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సర్వే

విశాలాంధ్ర-పొన్నలూరు: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా తనిఖీ కార్య క్రమంలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని టీడీపీ మండల అధ్యక్షులు అనుమోలు సాంబశివ రావు అన్నారు. సోమవారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయంలో టీడీపీకి చెందిన బూత్ కన్వీ నర్ల జాబితా అందించారు. బీఎల్ఓ ఓటర్ల తనిఖీలు జరిపే సమయంలో వలంటీర్లు లేకుండా చూడలని తహసీల్దార్‌ను కోరారు. యూనిట్ ఇంచార్జి దాసరి కృష్ణారావు పాల్గొన్నారు.

గడపగడపకులో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పామూరు: అర్హులైన ప్రతి ఇంటా సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అర్హత ప్రామాణికంగా అందిస్తున్నామని కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని కంబాలదిన్నె పంచాయతీ రజాసాహెబ్ పేట గ్రామంలో ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు సుబ్బయ్య లతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. ప్రతి ఇంట తిరుగుతూ అందుతున్న సంక్షేమ పథకాలు వివరాలను తెలుసుకున్నారు. వైసీపీ మండల అధ్యక్షులు గంగాసాని హుస్సేన్ రెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి, షేక్ చాంద్ బాషా (సెంట్రింగ్ బుజ్జి), అబ్దుల్, షేక్ నాయబ్ రసూల్, పింఛ్చాల తిరుపతిరెడ్డి, శ్రీరామ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బన్నీకి దారపనేని అభినందనలు

విశాలాంధ్ర-పామూరు: సన్నిహితుడు, శ్రేయోభిలాషి వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ) ప్రకాశం జిల్లా కో-ఆపరేటివ్ సొసైటీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్‌గా నియమించడం సంతోషకరమని కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులు రెడ్డి నివాసంలో బన్నీని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చంతో అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ముప్పవరపు చెన్నకేశవులు, పంగా నాగేంద్రం యాదవ్, ఇర్రి కృష్ణారెడ్డి, బన్నీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

బాల్య వివాహాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు: బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో సోమవారం సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఇంటికి తాళం వేసి వేరే పట్టణాలకు వెళ్లిన వారి వివరాలు సేకరించి అలాంటి ఇండ్లపై నిఘా వేయాలన్నారు. గ్రామాల్లో మందు అమ్ముతున్న బంకులు బడ్డీకొట్లు వివరాలు తెలియజేయాలన్నారు. సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాగును తలపించిన రోడ్డు

విశాలాంధ్ర-కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల గ్రామంలో ప్రజలు వినూత్నంగా నిరసన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా తమ వీధిలో వర్షపు నీరు మురుగునీరు రోడ్డుపై నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిల్లలతో కలిసి రోడ్డు నిలిచిన వర్షపు, మురుగు నీటిలో పడవలాట ఆడి నిరసన తెలిపారు. గ్రామ సచివాలయం వెనుక బాగానే మా వీధి ఉందని ఎన్నిసార్లు చెప్పినా అధికారులకు చెప్పిన పట్టించుకోలేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని రోడ్డుపై నిలిచి ఉన్న వర్షపు, మురుగు నీటిని తొలగించి స్థానిక ప్రజల సమస్య పరిష్కరించాలని అలానే ఈ ప్రాంతంలో రోడ్డు ఎత్తు పెంచి మురుగు,వర్షపు నీరు నిలబడకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గుర్రం జాషువాకు ఘననివాళి

విశాలాంధ్ర-కనిగిరి: గుర్రం జాషువా 53వ వర్ధంతి వేడుకలు కనిగిరి ఆర్అన్బి అతిథి గృహంలో టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, టీడీపీ తెలుగు యువత నాయకులు షేక్ ఫిరోజ్, షేక్ అహ్మద్, ఒంగోలు పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శి తమ్మినేని వెంకటరెడ్డి, వాణిజ్య విభాగ నాయకులు కోటా సురేష్ కుమార్, కనిగిరి బీసీ సెల్ అధ్యక్షుడు తిరుపాలు, ఎల్వీఆర్, సాంసంగ్ తదితరులు పాల్గొన్నారు.

తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గం

విశాలాంధ్ర-పెద్దారవీడు: తలరాతలు మారాలంటే చదువు ఒక్కటే మార్గమని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, రేగు మానిపల్లి సర్పంచి పాలగిరి వెంకట రామాంజిరెడ్డి అన్నారు. మండలంలోని రేగుమనిపల్లి గ్రామ పంచాయతీ లోని పోతంపల్లి గ్రామంలోని ఎం.పి.పి.యస్, ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ ఆధ్వర్యంలో జగన్న విద్యా కనుకలో భాగంగా సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను సర్పంచి రామాంజిరెడ్డి చేతుల మీదుగా, వైసీపీ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. పథకాలను విద్యార్థులు సక్రమంగా వినియోగించుకొని ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. సచివాలయం కన్వీనర్ బొట్టు కోటిరెడ్డి (డీలర్), ఉపాధ్యాయులు,వైసీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కంది విత్తనాల పంపిణీ

విశాలాంధ్ర-కనిగిరి: కనిగిరి మండలం వంగపాడు సచివాలయంలో సోమవారం జడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి ,వంగపాడు ఎంపిటిసి మడతల హజరతమ్మ రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు కంది యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అనేక సేవలు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. సర్పంచ్ రావులపల్లె తిరుపతయ్య, జమ్మలమడక సర్పంచ్ పాశం కొండయ్య, కృష్ణాపురం సర్పంచ్ నరాల వెంకటరెడ్డి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు. పేతూరి. సునీలు, నరసింహులు పాల్గొన్నారు.

అడుగడుగనా నీరా'జనం'

❖ వానలోను పాదయాత్ర ❖ అడుగడుగునా వినతులు ❖ జగన్‌ను సాగనంపితే రాష్ట్రానికి స్వేచ్ఛ
❖ నిప్పలు చెరిగిన లోకేష్ ❖ సంతనూతలపాడు కొనసాగుతున్న యువగళం యాత్ర

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు: నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర ప్రకాశం జిల్లాలోని సంతనూతలపాడు నియోజకవర్గంలో కొనసాగుతుంది. సోమవారం చీమకుర్తిలోని నెహ్రూ నగర్‌లోని మండల చేనేత కార్మికులు లోకేష్‌ను కలిసి వారి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చేనేతలకు పావలావడ్డీ, చేనేత ఉత్పత్తుల లోన్‌ను వర్తింపచేయాలని, చేనేతపై ఐదు శాతం జీఎస్‌టిని రద్దు చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక చేనేతల సమస్యలు పరిష్కరిస్తానని లోకేష్ హామీ ఇచ్చారు. జగన్ అసంబద్ధ పాలనతో చేనేతరంగం సంక్షోభంలోకి కూరుకుపోయిందని అన్నారు. గత నాలుగేళ్లలో 60 మంది చేనేతలు ఆత్మహత్యలు చేసుకోగా ముఖ్యమంత్రి వారిని కనీసం పరామర్శించలేని స్థితిలో ఉన్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక చేనేత వస్త్రాలపై జీఎస్‌టిని రద్దు చేయడంతో పాటు మగ్గాలున్న చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చీమకుర్తి బహిరంగసభలో నారా లోకేష్ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాత గాంచిన చీమకుర్తి గ్రానైట్ మళ్లీ తెలుగుదేశం అధికారంలోకి వస్తే జీవం పోస్తామని హామీ ఇచ్చారు. దేశంకోసం పోరాడిన ప్రకాశం పంతులు జన్మనిచ్చిన ఈ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న నేలపై పాదయాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. బాబాయిని చంపిన అబ్బాయిపై చిన్న క్విజ్ పెట్టి సమాధానం చెప్పాలని ప్రజలను అడిగారు. భారతిరెడ్డి అవినాష్ జగన్మోహన్‌రెడ్డిలతో పాటు సజ్జల రామకృష్ణాను వదలకుండా వారిపై పంచలు విసిరారు. వైయస్ రాజశేఖర్‌రెడ్డికి నిజమైన వారసురాలు షర్మిల అని పేర్కొన్నారు. సొంత చెల్లిని, తల్లిని స్వార్థ రాజకీయం కోసం వదిలేసిన ఘనుడు జగన్ అని పేర్కొన్నారు. మానవత్వాన్ని మరిచిపోయి సైకోగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రావత్ అనే యువకుడిపై దాడిచేసిన వ్యక్తి అతనిపై మూత్రం పోసిన వ్యక్తి మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ బాధితున్ని ఇంటికి పిలిచి కాళ్లు శుభ్రం చేసి ఆదర్శంగా నిలిచారని అన్నారు. అదే ఘటన ఒంగోలులో జరిగితే నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులను ఉచితంగా డాక్టర్లను చదివిస్తానని మాయమాటలు చెప్పారని, ఇప్పుడు మెడికల్ సీట్లు బజారులో అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి 20 లక్షలు ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలు ఎలా చెల్లించగలరని ప్రశ్నించారు. అన్ని మాయమాటలు చెబుతూ ప్రజలపై బాదుడే బాదుడుతో వివిధ రూపాలలో ఛార్జీలు విధిస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలు 9 సార్లు, ఆర్టీసి బస్సు ఛార్జీలు మూడు సార్లు పెంచడమే కాకుండా ఇంటిపన్ను, చెత్తపన్నుతో పాటు పెట్రోలు, డీజిల్ ధరలు అదుపు చేయలేని చేతకాని దద్దమ్మ ముఖ్యమంత్రి అన్నారు. ఈరోజు మార్కెట్‌లో కేజీ టమోటా రూ100 నుంచి 150 రూపాయలు ధర పలుకుతుందని కనీసం నిత్యావసర వస్తువుల ధరలు కూడా అదుపు చేయలేని పరిస్థితుల్లో ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉన్నారని తెలిపారు. గతంలో ఉన్న అన్నా క్యాంటిన్ పండుగ కానుకలు పెళ్లి కానుక, చంద్రన్నబీమా, ఫీజు రియంబర్స్‌మెంట్ అన్నింటిని మధ్యలో నిలుపుదల చేసిన ఘనుడని అన్నారు. సంపూర్ణ మధ్యపాదన నిషేదం అని చెప్పు ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చాక మద్యనిషేధం చేయకపోగా ప్రజలచేత కల్తీమద్యం తాగించి వారి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని తెలిపారు. జాబ్ కాలెండర్ ఇస్తానని చెప్పి యువతను మోసం చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు యువగళం నిధి క్రింద నెలకు రూ.3వేలు తాము అధికారంలోకి వస్తే ఇస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక వెంటనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేస్తామన్నారు. మరోపక్క ఈ ప్రభుత్వ పాలనలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పి 200 వారాలు దాటాక సీపీఎస్ రద్దు చేయడం లేదని ఇప్పుడు జీపీఎస్ అంటూ కొత్త డ్రామా మొదలుపెట్టారని తెలిపారు. పోలీసు వ్యవస్థను తన గుప్పెట్లో పెట్టుకొని టీడీపీ శ్రేణులపై దాడులు చేయించి అక్రమ కేసులు బనాయిస్తున్నారని, దీనిపై ప్రతీకారం తీర్చుకుంటామని తెలిపారు. యువగళం యాత్రలో స్థానిక మాజీ ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్‌తో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. చీమకుర్తిలోకి నారా లోకేష్ అడుగు పెట్టడంతో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి పూలవర్షం కురిపించి ఘన స్వాగతం పలికారు.

చెలరేగుతున్న గ్యాస్ మాఫియా



విశాలాంధ్ర-పీసీపల్లి: ప్రధాన రహదారుల కేంద్రంగా గ్యాస్ మాఫియా నడుస్తుంది. అడ్డదారిలో అధిక ధరలకు గ్యాస్ సిలిండర్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విధంగా గ్యాస్ మాఫియా అక్రమార్కుల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తుంది. జనావాసాల్లోనే రీఫిల్లింగ్ సాగిస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రధాన రహదారులతో పాటు మండలంలో అనేక ప్రాంతాలలో రీఫిల్లింగ్ యదేచ్ఛగా సాగిస్తున్నారు. దందాను అడ్డుకట్టు వేసే నాథుడు లేకపోవడంతో విచ్చలవిడిగా గ్యాస్ మాఫియా రెచ్చిపోతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో గ్యాస్ రిఫిల్లింగ్ చేస్తూ పేద ప్రజల సొమ్మును దోచుకుంటున్నారు. పెద్ద సిలిండర్ల నుండి చిన్న సిలిండర్లకు రీ ఫిల్లింగ్ చేసే సమయంలో ఒక్కసారిగా మంటలు అంటుకొని పెను ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అయినప్పటికీ ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు ఇటువంటి చర్యలకు పాల్పడుతుండడం నిత్యం జరుగుతూనే ఉంటుంది. గతంలో కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ రీ ఫిల్లింగ్ చేసే సమయంలో మంటలు అంటుకొని చేతులతో పాటు శరీరంలో కొన్ని భాగాలు కాలిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. గ్యాస్ సిలిండర్లను అధికంగా ఉపయోగించని వినియోగదారుల నుండి ఎల్పిజి సిలిండర్లను కొనుగోలు చేసి రీ ఫిల్లింగ్ చేసి అధిక ధరలకు ఇతరులకు అమ్మేస్తున్నారు మరీ ముఖ్యంగా ఐదు కేజీల సిలిండర్ లోకి రీ ఫిల్లింగ్ చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. ఇటువంటి గ్యాస్ మాఫియాపై పౌర సరఫరాల శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. దీంతో ఏమాత్రం భయం లేకుండా గ్యాస్ మాఫియా చుట్టుపక్కల ప్రజలను వ్యాపారస్తులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికార యంత్రం స్పందించి గ్యాస్ మాఫియా చేసే వారిపై చర్యలు తీసుకొని గ్యాస్ మాఫియాకు అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రమాదాలకు తావు లేకుండా కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఈ-క్రాప్ బుకింగ్‌పై శిక్షణ

విశాలాంధ్ర-దర్శి: స్థానిక మండల పరిషత్ సమావేశం హాలు నందు దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ వ్యవసాయ అధికారులు ఎంపిక చేయబడిన భరోసా కేంద్ర సిబ్బందికి 2023 ఖరీఫ్ సీజన్లో చేయబోవు ఈ క్రాప్ బుకింగ్ విధానాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కే బాలాజీ నాయక్ మాట్లాడుతూ ఈ సంవత్సరం కొత్తగా జియో రెఫరెన్స్ విధానంలో పొలం యొక్క అక్షాంశాలు రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారని తెలియజేశారు. అలాగే రైతులు వాస్తవంగా సాగు చేసిన పంటలను మాత్రమే మోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ముందుగానే ప్రణాలిక తయారు చేసుకుని రైతు భరోసా కేంద్రం మరియు సచివాలయంలో రైతులకు తెలిసేటట్లు ప్రదర్శించి నమోదు చేయాలని కోరారు. ఏ రోజు ఏ సర్వే నెంబర్లలో పంట నమోదు చేయబోతారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలని చెప్పారు. మండల రెవెన్యూ అధికారులను కలిసి ఆయా గ్రామాల్లో ఏంతమేర సాగు భూమి ఉందో అలాగే వ్యవసాయతర పొలాలు అనగా ప్లాట్లు ఈడు భూములు బంజరు భూముల వివరాలను ముందుగానే కనుక్కోవాలని తెలిపారు. జాయింట్ అజమాయిషీ విధానంలో అనగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వే యర్‌ల తో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి మాత్రమే పంట నమోదు చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి వి. బాలకృష్ణ నాయక్, డివిజన్లోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

I VENKATA RAMA RAO. M S/O Subbarao (Army No: 14412037X R/O Ravinuthala Village, Korisapadu Mandal, Bapatla (Previously PRAKASAM) District, have changed My Wife's Name from **VAJJA SREE-LAKSHMI** to **SRILAKSHMI VAJJA** and DATE of birth is 06-06-1981. Due to variation of army and civil records

30న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-దర్శి: దర్శి మండల పరిషత్ సర్వసభ సమావేశం ఈనెల 30న నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. సమావేశంలో రెవెన్యూ పౌరసరఫరాల విభాగం గ్రామీణ నీటి సరఫరా భాగం సాంఘిక సంక్షేమ శాఖ రోడ్లు భవనములు మండల వ్యవసాయ శాఖ మండల ఆరోగ్యశాఖ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ మండల విద్యాశాఖ రవాణా మరియు ఏపీఎస్ఆర్టీసీ ఎన్ఎస్పి గృహ నిర్మాణ శాఖ పశుసంవర్ధక శాఖ ఐసీడీఎస్ వైఎస్ఆర్ క్రాంతి పథకం మహాత్మా గాంధీ జాతి ఉపాధి పథకం పలు శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు, మండల ఎంపీటీసీలు, సర్పంచులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మణిపూర్ దోషులను తక్షణమే శిక్షించాలి

విశాలాంధ్ర-దొనకొండ: మణిపూర్‌లో దళిత క్రైస్తవులపై దాడులు చేసిన ఘటనలో దోషులను సుప్రీం కోర్టు వెంటనే శిక్షించాలని సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య తెలిపారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో సీపీయం పార్టీ ఆధ్వర్యంలో మణిపూర్ హింసాత్మక ఘటనలను ఖండిస్తూ నిరసిన కార్యక్రమం సోమవారం చేపట్టారు. మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి అనిల్, కె.కిరణ్‌కుమార్, అంజిబాబు, శ్రీకాంత్, రామయ్య, బాలరాజ్, ఫ్రాన్సీస్, ఏసుదాసు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి ఓటరు వెరిఫికేషన్‌పై అవగాహన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల: టీడీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం మండలంలో ఇంటింటికి ఓటరు వెరిఫికేషన్, ఓట్లు తీసివేతలు, కొత్త ఓట్లు చేర్చడంపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. రామచంద్రకోట, చింతల అగ్రహారం, కటకానిపల్లె, చిన్నదోర్నాల, చిన్నగుడిపాడు, జమ్మిదోర్నాల, హస్సానబాద్, పెద్ద బొమ్మలాపురం గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి, దోర్నాల మండల అధ్యక్షుడు ఏరువ మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో వివరించారు. యూనిట్ ఇన్‌చార్జిలు ఈదర మల్లయ్య, దొడ్డ శేషాద్రి, చంటి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు దేసు నాగేంద్ర బాబు, బూత్ ఇన్‌చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గిద్దలూరులో తూతూ మంత్రంగా ఓటర్ల సర్వే

విశాలాంధ్ర-గిద్దలూరు: కొంత మంది బీఎల్వోలు ఓటరు సర్వేను తూతూ మంత్రంగా చేస్తున్నారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించడమే కాక ఓటు లేనివారివి ఓటరు జాబితాలో నమోదు అగునట్లు చూడాల్సి ఉన్నా వారు ఏదో వచ్చాం వెళ్ళాం అన్నట్లు చేస్తున్నారని, కనీసం ఓటు వుందో లేదో కూడా తెలుపడం లేదని,అలాగే చాలా మంది ఆన్లైన్లో అప్లై చేసుకున్నా వారి దరఖాస్తులు పరిశీలించడం లేదని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.దీనిపైన ఎన్నికల కమిషన్ అధికారులు తగు చర్యలు తీసుకొని ఓటర్ల సర్వే సక్రమంగా జరిగేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల వంటగదికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కంభం: కంభం మండలం హజరత్‌గూడెంలోని పాఠశాలలో వంటగది లేక ఇబ్బంది పడుతున్న దృష్ట్యా సర్పంచ్ ఆర్థిక సహాయంతో వంటగది నిర్మాణం జరిగింది. ప్రాథమికోన్నత పాఠశాలలో వంటగది తాత్కాలిక నిర్మాణం కొరకు, ఆర్థిక సహాయం అందజేసిన హజరత్‌గూడెం, సర్పంచ్ షేక్ మహబూబ్ పీరా, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరోజిని, వంటగది నిర్మాణ పనులు చేయించిన విద్యకమిటి చైర్మెన్‌కు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బాలినేనిని సత్కరించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అమెరికా పర్యటన ముగించుకుని ఒంగోలు వచ్చిన సందర్భంగా సోమవారం వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకట్ రెడ్డి, పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, మర్రిపూడి మండల ఎంపీపీ వాకా వెంకట్రెడ్డి, కొనకనమిట్ల మండల మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మెట్టు వెంకట రెడ్డి, కనిగిరి ఏఎంసీ చైర్మన్ గజమాలతో సత్కరించారు. వైసీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-హనుమంతుని పాడు: మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హనుమంతుని పాడు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు పొలాల్లోకి వెళ్లి వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ మోటార్ వద్దకు వెళ్లి స్విచ్ ఆన్ చేయవద్దని రైతులకు వ్యవసాయ ముఖ్యమైనప్పటికీ ప్రాణాలు అత్యంత విలువైనవి కాబట్టి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలానే ఇంకా నాలుగైదు రోజులు వర్షాలు పడే అవకాశం ఉంది కాబట్టి జాగ్రత్త పడాలని ఆయన కోరారు. మండల జడ్పీటీసీ డాక్టర్ దద్దాల నారాయణ, ఎంపీపీ గాయం సావిత్రి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గడపగడపలో ఎమ్మెల్యేకు చేదు అనుభవం

విశాలాంధ్ర-కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్లలో సోమవారం జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కుందూరు నాగార్జునరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. ఓట్లు వేసి గెలిపించినందుకు తన కుమారుడిని ఒక కేసులో ఇరికించి జైల్లో పెట్టించారని రమణమ్మ అనే మహిళ ఎమ్మెల్యే నిలదీసింది. ఏ మొహం పెట్టుకొని తమ ఇంటికి వచ్చావని నిలదీసింది. రమణమ్మతో పాటు మరికొందరు కాలనీవాసులు కూడా గొంతుకలిపారు. ఎమ్మెల్యే ఎంత చెప్పినా వినకపోయేసరికి అక్కడి నుంచి వెళ్లిపోయారు. తమ గృహాలు దాటి వెళ్లిపోవడం ఏంటని మరికొందరు ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు తాము ఓట్లు వేయలేదా అని అసహనం వ్యక్తం చేశారు.

జగనన్న సురక్ష ఒక వరం

విశాలాంధ్ర-త్రిపురాంతకం: జగనన్న సురక్ష పథకం అందరికీ వరమని, దీన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి కోరారు. త్రిపురాంతకం మండల విశ్వనాథపురం సచివాలయం వద్ద జగనన్న సురక్ష పథకం నిర్వహించారు. ఈ కార్యక్రమం విశ్వనాథపురం సర్పంచ్ అధ్యక్షతన కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. టీమ్ నిర్వాహకులుగా తహసీల్దార్ కిరణ్ ఒక టీమ్, ఎంపీడీఓ సాంబశివరావు ఒక టీమ్‌ను పర్యవేక్షించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి పాల్గొన్నారు. తమకు అవసరమైన ధృవీకరణ పత్రాలు అందించిన సిబ్బందికి, నాయకులకు, ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సర్పంచ్ రంగబాబు, మాధవీలత, ఎంపీటీసీ ముసలయ్య, డీఎల్‌డీఓ సాయి కుమార్, ఎంపీడీఓ సాంబశివరావు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుర్రం జాషువాకు ఎమ్మెల్యే బుర్ర నివాళి

విశాలాంధ్ర-కనిగిరి: మహాకవి గుర్రం జాషువా 53వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కనిగిరి ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద జాషువా విగ్రహానికి చైర్మన్ అబ్దుల్ గఫూర్ తో కలిసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు రవికుమార్ ,ఎంపీపీ ప్రకాశం, జెడ్పిటిసి మడతలు కస్తూరి రెడ్డి, సానికొమ్ము రంగనాయకులు, రెడ్డి, కౌన్సిలర్ దేవరాజ్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, రామనబోయిన శ్రీనివాసులు, పెన్నా ఏడుకొండలు, భవనం కృష్ణారెడ్డి, రమేష్ వేల్పుల వెంకటేశ్వర్లు, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఐవీ రెడ్డి

విశాలాంధ్ర-కొమరోలు: మండలంలోని ఇడమకల్లు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్ ఖాసీం పీరా ఇటీవల రహదారి ప్రమా దంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసు కున్న గిద్దలూరు నియోజకవర్గ మాజీ వైసీపీ సమన్వయకర్త, నాయకులు ఐవీ రెడ్డి సోమవారం ఇడమకల్లు గ్రామంలోని ఖాసీం పీరా గృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు. ఖాసీం ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

విమలమ్మ మృతికి సురేష్ సంతాపం

విశాలాంధ్ర-యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖామాత్యులు ఆదిమూలపు సురేష్ పి.ఏ శ్యామ్ ప్రకాష్ తల్లి విమలమ్మ హఠాన్మరణం పట్ల మంత్రి సురేష్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వెంటనే స్పందన అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మద్దిపాడు: ప్రతి అధికారి తప్పనిసరిగా డాష్ బోర్డును ప్రతిరోజు పరిశీలించి సమస్యల పరిష్కరించే విధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. మండల పరిధిలోని హెూటల్ ఆవాస్ కాన్ఫరెన్స్ హాల్ నందు మెగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ మరియు జిల్లా ఉన్నత స్థాయి అధికారులు సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పలు గ్రామాల నుంచి వచ్చినటువంటి అర్జీదారుల నుంచి అర్జీలు సేకరించడం జరిగింది. నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు గత 11 సంవత్సరాల నుంచి రోడ్డు పక్కన ఉన్నటువంటి తన పొలాన్ని కొంతమంది రాజకీయ పలుకుబడితో కట్టడాలు జరిపినట్లు స్థానిక తహసిల్దార్ కు అనేక పర్యాయములు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడే లేడని సివిల్ సమస్యను కూడా క్రిమినల్ గా సృష్టిస్తూ కోర్టుకు వెళ్లాలని సంజయ్షి చెప్తున్నారు తప్ప సమస్యను పరిష్కరించేందుకు మండల స్థాయి అధికారులు కృషి చేయలేదని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ముందు వాపోయారు. దీనిపై కలెక్టర్ ఆ వ్యక్తి నుంచి పూర్తి వివరాలు తీసుకొని నాగులుప్పలపాడు తాసిల్దార్ ఎంపీడీవో, ఈవోపీఆర్డి సమక్షంలో చర్చించగా మండల ఉన్నత స్థాయి అధికారులు రాజకీయ నాయకుల ఒత్తులు ఉన్నట్లు కలెక్టర్కు తెలియపరచగా విస్మయం చెంది తదుపరి మండల స్థాయి అధికారులపై ఆగ్రహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, సమస్యలు పునరావతం కాకుండా చూడాలని సాధ్యమైనంత వరకు ఎప్పటి సమస్యలను అప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి అధికారి ప్రతిరోజు డాష్ బోర్డును పరిశీలించి, సదరు డాష్ బోర్డు లో ఉన్న సమస్యలను పరిష్కరించటానికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు మద్దిపాడు మండలం వెల్లంపల్లి ఆవాస్ హెూటల్ నందు నిర్వహించిన మెగా స్పందన కార్యక్రమానికి 152 అర్జీలు సేకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. శ్రీనివాసులు, ఒంగోలు ఆర్డీవో, నూతలపాడు నియోజకవర్గ ఆయా మండలాల తాసిల్దారులు ఎంపీడీవోలు, ఆయా శాఖల జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు హాజరయ్యారు.

మారెడ్డిపల్లిలో పొలంబడి

విశాలాంధ్ర-దర్శి: దర్శి మం డలం మారెడ్డి పల్లిలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. అంతర పంటలు సాగుతో అధిక దిగుబడుల అంతర పంటలు సాగు చేయడం వలన రైతుకు ప్రధాన పంట రావడానికి ముందే అంతర పంటలు ద్వారా పంట పెట్టు బడి చేతికి వస్తుందని ప్రకృతి వ్యవ సాయ మాస్టర్ ట్రయినర్ వై. మేరీ డేటిల్లా అన్నారు. మండలంలోని మారెడ్డిపల్లిలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వై.మేరీ డేటిల్లా పొలంబడి కార్యక్రమం ను సోమవారం నిర్వహించారు. ప్రతి సోమవారం ఉదయం 7 గంటలకు పొలంబడి నిర్వహిస్తామని తెలిపారు. యంటి కో-స్పెషలిటేటర్ డి.మూర్తయ్య, ఎం వేణుగోపాల్, జి.మురళి కృష్ణయం వెంకటరావు, కె.వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర-తాళ్లూరు: పొలం పనులకు వెళ్లిన ఒక రైతు పట్ల విద్యుత్ తీగ యమపాశంగా మారి ఆ రైతును బలి తీసుకున్న సంఘటన సోమవారం మండలంలోని నాగంబొట్ల వారి పాలెం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నాగం బొట్లవారిపాలెం గ్రామానికి చెందిన శనివారపు రమణారెడ్డి (40) ఆదివారం రాత్రి పొలం పనుల నిమిత్తం తన వ్యవసాయ భూమి వైపు వెళ్ళాడు. అతని పొలంలో అప్పటికే తెగిపడి ఉన్న త్రీఫేస్ విద్యుత్ తీగను గమనించకపోవడంతో తెగిపడి ఉన్న విద్యుత్ తీగ తగలడంతో రమణారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఏదైనా పనిమీద వేరే గ్రామం వెళ్లడేమోనని భావించారు. సోమవారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు భయంతో అతని చరవాణికి ఫోన్ చేస్తున్నా రింగ్ అవుతుందే కానీ సమాధానం రావడం లేదు. దీనిపై గ్రామంలో తమ బంధువులకు తెలపడంతో వారంతా వ్యవసాయ భూమి వైపు వెళ్లి పరిశీలించగా రమణారెడ్డి అక్కడ విగత జీవిగా కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మృతుడు రమణారెడ్డికి భార్య ఇద్దరు బాలికలు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉంటూ రైతుగా పొలం పనులు పై జీవిస్తూ ఇతర రైతులకు చేదోడు వాదోడుగా ఉంటున్న రమణారెడ్డి విద్యుత్ తీగల యమపాసానికి బలి కావడంపై గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

తాగునీటి పథకం నిష్ప్రయోజనం

విశాలాంధ్ర-పుల్లలచెరువు: పుల్లలచెరువు మండలంలోని రక్షిత త్రాగునీటి పథకం నిష్ప్రయోజనంగా మారిందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి దేవేండ్ల శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం పుల్లలచెరువులో సీపీఐ నాయకులు విలేకరులతో మాట్లాడారు. 2006-2007లో రూ.17 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలోని 44 గ్రామాలకు రక్షిత జలాలను అందించాలని ఉద్దేశంతో ఏర్పాటుచేసిన తాగునీటి పథకం అధికారులకు, కాంట్రాక్టర్లకు పాడి ఆవులా మారిందని విమర్శించారు. ప్రాజెక్టు నిర్మించి 15 సంవత్సరాలు దాటిన ఈ ప్రాజెక్టు ద్వారా పట్టుమని పది గ్రామాలకు కూడా త్రాగునీరు సక్రమంగా అయిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో తీవ్రమైన త్రాగునీటి సమస్య ఏర్పడగా అధికారులు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. అయినప్పటికీ ట్యాంకర్ల యజమానులకు బిల్లులు చెల్లించకపోవడంతో వారు ట్యాంకర్లు నిలిపివేసిన సందర్భాలు కొన్ని గ్రామాల్లో ఉన్నాయన్నారు. రక్షిత ప్రాజెక్టును అధికారులు కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముటుకుల త్రాగునీటి ప్రాజెక్టును వినియోగంలోనికి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో త్రిపురాంతకం, మండలాల సిపిఐ కార్యదర్శులు బాణాల రామయ్య, జీవి గురునాథం, తదితరులు పాల్గొన్నారు.

బాలినేనిని సత్కరించిన పీడీసీసీ చైర్మన్

విశాలాంధ్ర-కనిగిరి: ప్రకాశం జిల్లా మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డి-శచిదేవి దంపతులను సోమవారం ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైయం ప్రసాద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పిడిసిసి బ్యాంక్ చైర్మన్ గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రకాశం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పాల్గొన్న కనిగిరి ఏయంసీ చైర్మన్ సరితరెడ్డి, సాని కొమ్ము శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపిటిసి మందాది కృష్ణారెడ్డి, చిన్నఇర్లపాడు పంచాయతీ సర్పంచ్ మద్ధ బాబు, ప్రకాష్‌రెడ్డి, సంగు వెంకటేశ్వరరెడ్డి, కాసు సతీష్ రెడ్డి, ముత్యాల సుధాకర్‌రెడ్డి, పులి రమేష్‌రెడ్డి, దాదిరెడ్డి మాలకొండారెడ్డి, చాగంరెడ్డి అమరనాథ్ రెడ్డి(నాని), తవ్వా రాజేంద్రరెడ్డి, సోమిరెడ్డి, ఇర్రి కృష్ణారెడ్డి, లాయర్ రామసుబ్బారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

షాడో నేతపై సిబ్బంది ఆగ్రహం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరు పంచాయతీలో కార్యదర్శి తీరు వివాదస్పదమైన సంగతి తెలిసిందే. దీనిపై 'విశాలాంధ్ర'లో 'అంతా నా ఇష్టం' శీర్షికన కథనం ప్రచురితమైంది. కథనంపై పంచాయతీరాజ్ అధికారులు అంతర్గతంగా విచారిస్తున్నారు. అయితే పత్రికలో కథనం రావడంపై పంచాయతిలోని ఓ షాడో నేత పంచాయతీ సిబ్బందిని సోమవారం దుర్భాషలాడాడు. సదరు నేత కొంత కాలం క్రితం ఇదే పంచాయతీలో ఒప్పంద ఉద్యోగిగా పంచాయతీలో విధులు నిర్వహి స్తున్నాడు. ఈ క్రమంలో పంచాయతీలోని ఉద్యోగులను దుర్భాషలాడడంతో ఉద్యో గులు సైతం సదరు నేతపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిధి మించి మాట్లాడుతే తగు పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పినట్లు సమాచారం. అధికారులు రూల్ ప్రొవిజన్ ప్రకారం విధులు నిర్వహిస్తారన్నారు. అయితే ఇష్టానుసారం మాట్లాడితే పంచాయతీ పరువు మరింత బజారున పడుతుందని హెచ్చరించినట్లు తెలిసింది.

ఘనంగా అయ్యంకి వర్ధంతి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు: గ్రంథాలయ పితా మహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి సోమవారం నాగులుప్పలపాడు మండలం ఉప్పు గుండూరు శాఖ గ్రంథాలయంలో నిర్వ హించారు. గ్రంథపాలకుడు ప్రసాద్ మాట్లాడుతూ వెంకటరమణయ్య తన యావదాస్తులు పోగొట్టుకుని గ్రంథాలయాల అభివృద్ధికి కాంక్షించిన మహనీయు డన్నారు. స్వతంత్రానికి ముందే గ్రంథాలయ ఉద్యమాన్ని ప్రారంభించి ఆదర్శవం తంగా నిలిచాడన్నారు. రాఘవరావు, వెంకటేశ్వర్లు, ఇర్మియ పాల్గొన్నారు.

బి.ఎస్. రావుకు శ్రీ చైతన్య సిబ్బంది నివాళి

విశాలాంధ్ర-కనిగిరి: ప్రాణదాతగా జీవిత ప్రయాణం ప్రారంభించి విద్యాదాతగా సేవలందించిన మహా మనిషి శ్రీ చైతన్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూట్స్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు అని కనిగిరి శ్రీ చైతన్య విద్యాసంస్థల సిబ్బంది గుర్తు చేసుకున్నారు. ఆదివారం ఒంగోలు శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్ లో డాక్టర్ బి.ఎస్.రావు పెద్దకర్మ, సంతాప సభ సందర్భంగా నివాళులర్పించారు. ముందుగా ఆయన చిత్రపటం వద్ద నివాళు లర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆర్ ఐ వై.అనిల్ కుమార్ మాట్లాడుతూ లక్షల మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వేల కుటుంబాలకు ఉపాధి కల్పించిన ఆయన ప్రజల హృదయాల్లో చెరిగిపోని స్థానం సంపాదించారు అన్నారు. కనిగిరి శ్రీ చైతన్య విద్యాసంస్థల సిబ్బంది బిఎస్ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతిన పూనారు. నివాళులర్పించేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. ఈ కార్యక్రమంలో హనీష్ భాను, షాహినా డిన్స్ రవి, వెంకట్రావు అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ షేక్ మునీర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జోరుగా నకిలీ పురుగు మందుల దందా!

కొరవడిన విజిలెన్స్ తనిఖీలు

విశాలాంధ్ర-కనిగిరి: నకిలీ పురుగు మందుల వ్యాపారానికి కనిగిరి నియోజకవర్గం అడ్డాగా మారింది. వేల రూపాయలు వెచ్చించి పురుగుమందులు కొనుగోలు చేస్తున్న రైతులు తెగుళ్లు తగ్గకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. వ్యవసాయం భారంగా మారిన నేపథ్యంలో ఎరువుల ధరలు విపరీతంగా పెరగటంతో అప్పులు చేసి సాగు చేస్తున్న రైతులకు నకిలీ పురుగుమందులు వాడటంతో దిగుబడి రాక మరింత అప్పుల కూపంలోకి నెడుతున్నాయి. ఫర్టిలైజర్ యజమానులు నాణ్యమైన మందులు కాకుండా ఎక్కువ శాతం లాభాలు వచ్చే వాటిని ఫర్టిలైజర్ దుకాణ యజమానులు రైతులకు మాయమాటలు చెప్పి నకిలీలు, బయో మందులు విక్రయిస్తున్నారు. కనిగిరి నియోజకవర్గంలోని కనిగిరి, వెలిగండ్ల, పామూరు, సిఎస్పురం, హనుమంతునిపాడు, పీసీ పల్లి మండలాల్లో 50కి పైగా పురుగుమందుల దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల్లో సగానికి పైగా వాటిల్లో పురుగుమందులు నకిలీలు, బయలు విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

రైతులకు అవగాహన శూన్యం

రైతులకు ఎప్పటికప్పుడు పురుగుమందుల వాడకంపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించి ఏ మందులు పిచికారి చేయాలో తెలియజేయాలి. కానీ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించడంలో చొరవ చూపటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంట తెగులకు రైతులు నేరుగా ఫర్టిలైజర్ దుకాణ యజమాని చెప్పిన మందులను తీసుకెళ్లడంతో తెగుళ్ల తగ్గక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా వ్యవసాయ అధికారులు స్పందించి రైతులకు పురుగుమందుల వినియోగంలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

బయో ఉత్పత్తులకు అడ్డాగా...

బయో కెమికల్స్ పేరుతో రైతులకు మరింత మోసానికి ఫర్టిలైజర్ యజమానులు గురి చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఫర్టిలైజర్ యజమానులు భయం ఉత్పత్తులను రైతులకు అంటగడుతున్నారు. రైతుల బలహీనతను ఆసరా చేసుకున్న మరికొంతమంది రైతులు నకిలీ పురుగుమందులను విక్రయిస్తున్నట్లు తెలిసిన సమాచారం. నకిలీ పురుగుమందులను నియంత్రించేందుకు విజిలెన్స్ అధికారులు పురుగుమందు దుకాణాలపై ఆకస్మికంగా దాడులు చేసి నియంత్రించాల్సినది. అయితే విజిలెన్స్ అధికారులు పురుగుమందు దుకాణాలపై ఆకస్మిక దాడులు చేయకపోవడంతో ఫర్టిలైజర్ యజమానుల ఆటలు సాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ పురుగు మందులు, బయో మందులు కొనుగోలు చేసి రైతులు మోసపోతున్నారని ఈ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ విధానాలపై శిక్షణ

విశాలాంధ్ర-పెద్దారవీడు: స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు భరోసా కేంద్ర సిబ్బందికి 2023 ఖరీఫ్ సీజన్లో చేయబోవు ఈ క్రాప్ బుకింగ్ విధానాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ ఈ సంవత్సరం కొత్తగా జియో రెఫరెన్స్ విధానంలో పొలం యొక్క అక్షాంశాలు రేఖాంశాల ఆధారంగా నమోదు చేస్తారని తెలియజేశారు. అలాగే రైతులు వాస్తవంగా సాగు చేసిన పంటలను మాత్రమే మోదు చేయాలని ఆదేశించారు. ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో ముందుగానే ప్రణాలిక తయారు చేసుకుని రైతులకు తెలిసేటట్లు గ్రామ సభలు నిర్వహించి నమోదు చేయాలని కోరారు. ఏ రోజు ఏ సర్వే నెంబర్లలో పంట నమోదు చేయబోతారో ఒక రోజు ముందుగానే రైతులకు తెలియజేయాలని చెప్పారు. మండల రెవెన్యూ అధికారి ఆయా గ్రామాల్లో ఏంతమేర సాగు భూమి ఉందో అలాగే వ్యవసాయతర పొలాలు అనగా ప్లాట్లు.బీడు భూములు బంజరు భూముల వివరాలను ముందుగానే వీఆర్ఓల వద్ద కనుక్కోవాలని తెలిపారు. జాయింట్ అజమాయిషీ విధానంలో అనగా గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి, వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్‌లతో కూడిన బృందాలు పంట పొలాన్ని సందర్శించి మాత్రమే పంట నమోదు చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారినీ కే. బుజ్జి బాయి మరియు మండల రెవెన్యూ అధికారి. క్రిష్ణారెడ్డి మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు రెవెన్యూ అధికారులు పాల్గొనడం జరిగింది.

మణిపూర్ దోషులను శిక్షించాలని కోరుతూ ర్యాలీ

విశాలాంధ్ర-దర్శి: స్థానిక ఎల్ఈఎఫ్ చర్చి క్రిస్టియన్‌పాలెం నుండి గడియార స్తంభం నాలుగు కూడలిలో మానవహారం అక్కడనుండి దర్శి డిఎస్పి ఆఫీసు వరకు మణిపూర్‌లో జరిగిన క్రైస్తవుల పై దాడి చర్చిలలో ధ్వంసం చేయటం మహిళను నగ్న ప్రదర్శించిన దోషులపై కఠినంగా శిక్షించాలని కోరుతూ దర్శి రీజనల్ పాస్టర్ పెయర్ ఫెలోషిప్, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి దర్శి రీజనల్ పె యర్ ఫెలోషిప్ నాయకులు సూర్యచంద్ర హర్షల్ ఏసుదాసు, ఏసుబాబు మాట్లాడుతూ మణిపూర్ లో క్రైస్తవులపై అమానుష్యమైన దారులు చేస్తూ చర్చిలను ధ్వంసం చేయటం, మహిళను చూడకుండా నగ్నంగా ప్రదర్శించి దేశాన్ని కాపాడిన సైనికుడు భార్యను గోరాతి గోరంగా ప్రదర్శించడం హేమమైన చర్యని భారతదేశంలో మహిళలకు రక్షణ కరువైందని దీనికి బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించి, ఆ రాష్ట్రానికి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని వారు కోరారు. దళిత ప్రజా సంఘాల నాయకులు జి ప్రేమ్ కుమార్, కే గోవింద ప్రసాదు మాదిగ గాలి ముట్టి దేవప్రసాద్ మాట్లాడుతూ మణిపూర్ ఘటన జరిగి రెండేళ్ల కావస్తున్న ఈరోజు కూడా ఆ రాష్ట్రంలో అల్లర్లు క్రైస్తవులపై దాడులు, చర్చిలను ధ్వంసం చేయదాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో మతోన్మాదశక్తులు పెట్రేల్ పోతున్నాయని, బిజెపి పార్టీ అధికారండున్న రాష్ట్రాలలో క్రైస్తవులు మనుగడ కష్టతరమవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో కేంద్రంలో బిజెపి, అధికారం నుండి గద్దిదించాలని మణిపూర్ ఘటనలో దోస్తులను కఠినంగా శిక్షించాలని, క్రైస్తవులకు చర్చలకు రక్షణ కల్పించాలని, మతసామరస్యాన్ని కాపాడాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్చైర్మన్ కేసనపల్లి, నాగేశ్వరరావు, జి ప్రేమ్ కుమార్, మాదిగ మహానాడు దర్శి నియోజకవర్గ ఇంచార్జ్ గట్టుపల్లి ప్రసాదు, అధిక సంఖ్యలో ఐదుమండలాల పాస్టర్లు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక డిఎస్పి అశోక్ వర్ధన్ రెడ్డికి దర్శి తాసిల్దార్ కావేటి వెంకటేశ్వర్లుకు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు.

గుండ్లకమ్మకు నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-ఒంగోలు: గుండ్లకమ్మ ప్రాజెక్టు మిగిలిపోయిన పనులు పూర్తి చేసేందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించాలని గుండ్ల కమ్మ ప్రాజెక్టు ఆయకట్టు రైతు సంఘం నాయకులు ప్రభుత్వం డిమాండ్ చేశారు. స్పందన కార్యక్రమంలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ గుండ్లకమ్మ ప్రాజెక్టు పూర్తయి 14 సంవత్సరాలు నిండాయ అన్నారు.అయితే పంట కాలవలు పూర్తిస్థాయిలో నిర్మించని కారణంగా ప్రాజెక్టు కింద ఉన్న మండలాలకు తాగునీరు సాగునీరు పూర్తి స్థాయిలో అందడం లేదని పేర్కొన్నారు. గతేడాది వరద నీరు కారణంగా ప్రాజెక్టుకు సంబంధించిన మూడు గేట్లు కొట్టుకుపోయాయన్నారు.అయితే వీటిని నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టలేదు అన్నారు. దీంతో ప్రాజెక్టులు నిలవకుండా నీరు సముద్ర పాలవుతుందన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు కింద ఉన్న మద్దిపాడు, నాగులప్పలపాడు, ఒంగోలు మండలం ప్రజలకు సాగునీరు తాగునీరు సక్రంగా అందటం లేదన్నారు. గేట్లు వెంటనే నిర్మించకపోతే వచ్చే వేసవిలో ప్రజలు తాగు నీటి కోసం సాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడతాయన్నారు.అలాగే నిర్వాసితుల కాలనీలో అనేక సమస్యలు తిష్ట వేశాయన్నారు. ఇప్పటికే స్మశానం లేని కారణం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి గుండ్ల కమ్మ ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు ఆయకట్టు రైతు సంఘం అధ్యక్షులు నాది పెద్ది వరహాలు చౌదరి, వడ్డే కోటిరెడ్డి,కె నాగేశ్వరరావు, జి కోటేశ్వరరావు, కే నాగార్జున, రామ్సన్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రజల నుండి వచ్చే పిర్యాధులను పరిష్కరించుటకు ఎస్పీ మల్లిక గర్గ్ జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమంను నిర్వహించారు. జిల్లాలో పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వ్రాతపూర్వక వినతులను ఎస్పీ స్వీకరించి వారితో ముఖాముఖీ మాట్లాడి వారి సమస్యల పూర్వాపరాలను అడిగి తెలుసుకుని వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో వెంటనే ఫోన్ లో మాట్లాడి స్పందన కార్యక్రమంలో వచ్చిన ఆయా ఫిర్యాదులపై వెంటనే చట్టప్రకారం విచారణ జరిపి పిర్యాదుదారులకు త్వరితగతిన న్యాయం అందించేలా చూడాలని ఆదేశించారు. అలాగే స్పందన పిర్యాదులు స్వీకరించినప్పటీ నుండి క్లోజ్ అయ్యేంతవరకు నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, అలాగే స్పందన పిర్యాదులపై తీసుకున్న చర్యలపై కూడా నివేదిక ఇవ్వవలసిందిగా అధికారులను ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ఇలా ఉన్నాయి.కంభం మండలానికి చెందిన జె.రాజశేఖర్ అనే వ్యక్తి యాక్సిస్ బ్యాంక్ లో పని చేస్తున్నానని, తనకు హౌసింగ్ లోన్ ఇప్పిస్తానని నమ్మబలికి తన వద్ద నుండి పలు ధపాలుగా రూ.23,32,815/- తీసుకోని హౌసింగ్ లోన్ ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని గిద్దలూరు పట్టణంకు చెందిన టి.క్రిష్ణమోహన్ అనే వ్యక్తి పిర్యాదు. తనకు స్టాఫ్ నర్స్ గా కాంట్రాక్ట్ బేసిస్ లో పోస్ట్ ఇప్పిస్తానని మార్కాపురం టౌన్ న్ చెందిన సుస్మిత భూషణ్ అనే వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికించి తన వద్ద నుండి తన వద్ద నుండి రూ.1,50,000/- రూపాయలు తీసుకొని ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు అడుగుతుంటే రూ.30,000/- తిరిగి ఇచ్చినట్లు,మిగిలిన డబ్బులు అడుగుతుంటే ఇవ్వటం లేదని పెద్దారవీడు మండలంకు చెందిన కె.నాగేశ్వరరావు అనే వ్యక్తి ఫిర్యాదు.ఈ స్పందన కార్యక్రమంలో ఏ ఎస్ పి (అడ్మిన్)కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి, డి.ఎస్. బి డిఎస్పీ బి.మరియాదాసు, ప్యానల్ అడ్వకేట్ టీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో అక్రమ నిర్మాణం

విశాలాంధ్ర-గిద్దలూరు: స్థానిక నరవ రోడ్డులోని శ్రీ సీతారామ కళ్యాణ మండపంలో అనుమతి లేని అక్రమ నిర్మాణం చేపట్టారు. సదరు నిర్మాణానికి నగర పంచాయతీ నుంచి ఎటువంటి అనుమతులు లేవు.నిత్యం పర్యవేక్షించాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కాని పరిస్థితి,సామాన్యులు చిన్నపాటి నిర్మాణం చేపడితే ఆగ మేఘాల మీద వచ్చి దానిని నిలుపుదల చేస్తారు.సామాన్యులకు ఒక న్యాయం ఉన్నవారికి మరో న్యాయం అన్నట్టుగా నగర పంచాయతీ అధికారుల తీరు ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఒంగోలు తహసీల్దార్‌పై సీఎంకు ఫిర్యాదు

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్: డీఈఓ ఆఫీసులో ఏఎస్ఓగా పనిచేస్తున్న జంపన కృష్ణ కుమార్ కుల నిర్ధారణ విచారణలో, ఒంగోలు తహసిల్దార్, ఆర్ఐల నిర్లక్ష్యంపై నివేదిక ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయం సిసిఎల్ఏను కోరింది. బీసీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొటికలపూడి జయరాం ఈ విషయాన్ని సోమవారం పత్రికా విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ, కాపు టీచర్ల సంక్షేమ సంఘం (కట్వా) జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన జంపన కృష్ణ కుమార్, బీసీ-బి, ఈడిగ క్యాస్ట్ సర్టిఫికేట్ తో 1996 డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపిక య్యారన్నారు. దీంతో తాను కృష్ణ కుమార్ కుల నిర్ధారణపై 2021లో అప్పటి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశానన్నారు. అయితే రెండేళ్లుగా విచారణ ముందుకు సాగలేదన్నారు. స్కూల్ అసిస్టెంట్‌గా తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పాఠాలు చెప్పాల్సిన కృష్ణ కుమార్, డిఇఓ ఆఫీసులో ఉంటే, విచారణను ప్రభావితం చేస్తారని తాను ఫిర్యాదు చేయ దంతో కృష్ణ కుమార్‌ను స్కూలుకు పంపారన్నారు. అయితే కృష్ణకుమార్ మరలా డిఈఓ ఆఫీస్ కు వచ్చారన్నారు. దీంతో మరోసారి తాను జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశానని, అయితే కృష్ణకుమార్, ఏఎస్ఓ నియామక ఉత్తర్వులపై కోర్టులో స్టే తెచ్చుకొని డీఈఓ ఆఫీస్లో పనిచేస్తున్నారన్నారు. 2006 టీచర్ల బదిలీల్లో జరిగిన అవకతవకలకు బాధ్యులుగా గుర్తిస్తూ ప్రభుత్వం సస్పెండ్ చేసిన వారిలో జంపన కృష్ణ కుమార్ కూడా ఉన్నా రన్నారు. ప్రభుత్వం నుండి సుమారు 90 వేల రూపాయలు జీతం తీసుకుం టున్న కృష్ణ కుమార్, కేవలం 18 వేల 500 రూపాయల జీతంగా ప్రభుత్వం నిర్ణయించిన కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాన్ని చేస్తున్నారన్నారు. ఐటీ సెల్ ఏర్పాటై, అందులోకి టీచర్లు ప్రవేశం మొదలయ్యాకే, నిబద్ధతతో బడుల్లో పాఠాలు చెప్పే టీచర్లకు నష్టం జరుగుతుందన్నారు. కుల నిర్ధారణ విచారణ ముగిసేంతవరకు, కృష్ణ కుమార్ ను డీఈఓ కార్యాలయం నుండి బడికి పంపాలన్నారు. కృష్ణ కుమార్ కుల నిర్ధారణ విచారణను ఒంగోలు తాసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు మొక్కుబడిగా నిర్వహించారన్నారు. కృష్ణ కుమార్ బీసీ కాదంటూనే, అందుకు బలమైన ఆధారాలను తమ నివేదికలో పొందుపరచలేదన్నారు. ఒంగోలు ఆర్డీఓ సైతం, తాసిల్దార్ నివేదిక లో ఉన్న లోపాలను గుర్తించి వెనక్కి పంపారన్నారు. సమాచార హక్కు చట్టం ద్వారా తాను తహసిల్దార్ నివేదికను తీసుకుని, నివేదికలోని లోపాలపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేశానన్నారు.